111

# గొడ్డుచాకిరి - గుడ్డక్కరువు...

రెండు మూడు వేల సంవత్సరాల కిందట నుంచీ, మనకూ, ఇతర దేశాలకూ ముఖ్యంగా మధ్య ప్రాచ్య దేశాలకూ, వాణిజ్య సంబంధాలున్నాయి. మన దేశం నుండి, వందలాది నౌకలు, సరుకుల్ని నింపుకొని, ఆయా దేశాల తీరాలలో లంగరు వేసుకొని నిలిచేవి. మన సరుకుల నావల కోసం, మధ్య ప్రాచ్య దేశాలవారు ఎదురు చూస్తూ ఉండేవారు. మన దేశంలో తయారయిన ఉక్కు కత్తులు, శిరస్త్రాణాలు, ఆభరనాలు, వస్త్రాలు, సుగంధ ద్రవ్యాల కోసం అక్కడి సంన్నులు ఎగబడేవారు. కొన్నికొన్ని వస్తువులను, డబ్బుల్లేకుండా వాటి బరువుతూగే బంగారం చెల్లించి మరీ కొనేవారనీ, చరిత్రకారులు చెబుతున్నారు.

తార్కాణాలూ,రుజువులూ చూపడమంటే సరేననుకోండి, ఓ చిన్న సెనగడొక్కులో ఇమిడేపాటి వస్త్రాలను ఆనాటి చేనేత పనివారు తయారు చేసేవారుట. బంగారు, వెండి, జరీ పనివాడితనానికి, మన దేశం పెట్టింది పేరు. అంతటి మహోన్నతమయిన సంప్రదాయానికి వారసుడు మన రామస్వామి. తరతరాలుగా రామస్వామి కుటుంబీకులు ఈ వృత్తినే నమ్ముకున్నారు.

''ఇప్పుడంటే మా పని ఎందుకూ కొరగాకుండా పోయిందనుకోండి. నిజానికి ఇంతకన్నా మంచి వృత్తి ఏముందో మీరే చెప్పండి! అన్నంత ఇరువాత సిగ్గుదాచుకోవడానికి వస్త్రం ముఖ్యం కదా! అన్నం లేకుండా మీరు వీధుల్లో తిరగవచ్చు. మీరు తిన్నారో తినలేదో- మీరు చెబితే తప్ప తెలియదు. కానీ గుడ్డ  సంగతి అలా కాదుకదా! ఏదీ మీ ధోవతి, చొక్కావిడిచి ఓ పది నిమిషాల పాటు అలా తిరిగిరండి చూద్దాం. మిమ్మల్ని పిచ్చివాడికింద జమకట్టి, రాళ్ళతోనన్నా కొడతారు, లేదా న్యూసెన్సు కేసు పెట్టి జైలుకన్నా పంపుతారు. అవునా? - మరి మా వృత్తికీ గతి ఎందుకుపట్టిందో తెలియదు'' అన్నాడు రామస్వామి రుసరుసలాడుతూ, జంటకవుల్లాగా, విడవకుండా ఏడుస్తున్న కవలపిల్లల్ని భార్యదగ్గిర విడిచి వచ్చాడు. వస్తూనే చుట్టతీసి వెలిగించాడు తన అసహ్యాన్నంతా కూడదీసుకుని, చుట్టకొరికి, తుపుక్కున ఊశాడు.

''మా బతుకుల్లాగా ఇది కంపనా, కట్టైనా కాలకుండా వుంది బాబుగారూ! దవడలు పీక్కుపోతున్నాయిగానీ, బొక్కడు పొగరాదు. పారపోయిందేమో ననుకున్నా... కాదు- అసలు అడ్డసరుకు. దీని కులమే ఇలాంటిది'' అన్నాడు రామస్వామి, ఇంకో చుట్టను వెలిగిస్తూ.

రామస్వామి తాతపేరు కూడా రామస్వామిగారే! ఆ రోజుల్లో ఆయనగారు- రోజుకో పంచలచాపు నేసేవారుట, ఆయన హస్తవాసి కూడా మంచిదేనంట. పూళ్ళో ఏ ఇంట పురుడొచ్చినా తన తాతగారే 'కాట్రీడు కోక' నేసి ఇచ్చేవారుట. ఆయన్నేసిన దుప్పట్లు ఇంకా ఉన్నాయిట, ఎలుకలుకొట్టి, కొర్రుబట్టి, పోతే తప్ప- దారం పీచు రేగడం గానీ, పోగు తప్పుపడడం గానీ చస్తే జరిగేది కాదన్నాడు రామస్వామి.

మా తాతను నేనెరగనయ్యా బాబూ! మా తాత చచ్చిపోయిన ఏడాదికి నేను కడుపున పడ్డాను! మా అయ్య నాకు వాల్లయ్య పేరు పెట్టుకున్నందుకే...నేనా! ఆయనంత పనివాణ్ని కాదనుకోండి...అసలు - ఆనాటి పనివాడితనం యిప్పుడెవడిక్కావాలయ్యా? అంతా నదరు మీరు నడుస్తున్నారు జనం! నాణ్యం ఏ గుజిగాడిక్కావాలి?' అని, చుట్టను అవతల పారేశాడు రామస్వామి.

తన తండ్రి కూడా మంచి పనివాడేనన్నాడు రామస్వామి.

"ఆ రోజుల్లోనండి- అప్పయ్య సెట్టి పంచెలన్నా చీరలన్నా జనం ఎగరేసుకుపోయేవారు. చీరనేసి, రంగులద్ది చిటికేశ్వర చెట్టుకొమ్మ మీద ఆరేసినప్పుడు చూస్తేనండీ వళ్ళు పులిసిపోయేదంటే నమ్మండి! రెండుకళ్ళూ చాలేవే కాదు. ఆయన సాచేత మనిషి మళ్ళా వళ్ళు దాచుకునేవాడా- అంటే, అదీకాదు! కానీ, గంటల మీదనో, రోజుల మీదనో కావాలంటే మాత్రం ఆయనకు కోపం వచ్చేది. ఊపిరి తిరగనంత పని, మజూరి ఎక్కువ తీసుకుంటాడు. నేత గ్యారంటీ, రంగు గ్యారంటీ, ఒకసారి ఉమ్మనేని సానయ్యగారని, మా వూళ్ళో పెద్ద ఆసామీ ఉన్నాడండీ! రెండొందలెకరాల పొలం. ఆయనగార్ని అందరూ 'డాబా సానయ్యగారు' అంటారు. మా వూళ్ళో అప్పటికి డాబా కట్టించినవారు ఆయనగారొక్కరే. ఆయన కూతురు పెళ్ళొచ్చింది. మా నాన్న ఆ పెళ్ళి చీరె నేశాడండీ! చెబితే మీరు అబద్ధమనుకుంటారేమో, దశావతారాలూ, ఆ చీరమీద దించేశాడండీ, నెల పదిహేను రోజులు పట్టింది. ఆ చీరకు మా నాన్న కూలీ తీసుకోలేదు. కట్నకారయిన పెయ్యను మాకు తోలిపెట్టాడు. నేను చిన్నవాణ్ణనుకోండి. అయినా నాకు బాగా గుర్తు ఉంది" అన్నాడు రామస్వామి.

అప్పయ్యశెట్టిగారి ముగ్గురు మగపిల్లల్లోనూ రామస్వామి ఆఖరివాడు, చిన్నతనంలో అతను అంతో ఇంతో చదువుకున్నాడుగానీ, అక్షరం మీదకన్నా మగ్గం మీదనే మనసుండడంతో చదువు గుంటపూలు పూసింది.

"ఏం చదువులో ఏం పత్తికట్టో బాబూ! మా మేనల్లుళ్ళున్నారు... నాకయితే తెలియదుగానీ, పెద్ద చదువే చదివారు. నాలుగేళ్ళయింది ఉద్యోగం లేదూ, నా బొందాలేదు. అడ్డగాడిదలా బలాదూరు తిరుగుతున్నారు. మా బావ నెత్తీ నోరు బాదుకొంటాడు. వాళ్ళకు చీమకుట్టినట్లు కూడా ఉండదు... మరీ కోపమొచ్చి కసురుకుంటే, కొట్టడానికి మీదిమీదికొస్తున్నారని మా అక్క మొన్న వచ్చినప్పుడు చెప్పుకుని ఏడ్చింది. నేను సంతకం పెడతానుగానండీ - సరిగ్గా చదవలేను" అన్నాడు రామస్వామి.

ఆ తరువాత తన సంగతి చెప్పుకొచ్చాడు. తనకు ముగ్గురు పిల్లలని, రెండో కాన్పుకు కవలలనీ చెప్పాడు. తన భార్యక్కూడా ఈ పని తెలుసునన్నాడు. కండెలుచుట్టడం, ఆసుపొయ్యడం, ఆవిడే చేస్తుందన్నాడు. ఈ వృత్తిని నమ్ముకోవడమంత బుద్ధి తక్కువ ఇంకొకటి లేదన్నాడు. దానిక్కారణాలు చెప్పుకొచ్చాడు.

"నూలు దొరకదు. దొరికినా ఎక్కువ ధర యిచ్చి కొనాలి. రంగులు మరీ మండిపోతున్నాయి. చచ్చి చెడి నేశామనుకోండి, అమ్మడం మరీ కష్టం. మగ్గం మీదనే కూర్చోనా? బజార్లంట తిరిగి నేసినవాటినే అమ్ముకోనా?... నిజమే, అక్కడక్కడా సొసైటీలున్నాయి. వాళ్ళను అమ్ముకోవచ్చు ననుకోండి అక్కడ లక్ష గ్రూపులు, ముఠాలు, తగాదాలు, అది బాగాలేదని, ఇది బాగాలేదని వంకలు పెడతారు. తడిచేస్తే గమ్మున తీసుకుంటారు. కానీ అందరికీ తడి చేసుకుంటూపోతే, నేను 'పొడిపొడి' అయిపోతాను బాబూ, బ్యాంకులు డబ్బులిస్తాయన్నారు. తిరిగి తిరిగి వచ్చాను. ఆఖరికి ఒకాయన్ని పట్టుకున్నా... పేరెందుకులేండి బాబూ ఆయనింకా బ్రతికేవున్నాడు. చెబితే నా గొంతు పిసికేస్తాడు కూడా. ఆయన్ని 'తడి'చేశా, వారం తిరక్కుండా లోను శాంక్షనయింది. ఏదో సామెత చెబుతారే- 'అంగట్లో పూస అటూ పోదూ, ఇటూ రాదు' అని అలాగయింది. ఆ అప్పు... ఇంకా చెల్లు వేయడంలా,

ఏం వేస్తాం అయ్యగారూ, గొడ్డుచాకిరీ, చేస్తున్నామా? ముద్దకూ కరువే, ఆఖరుకు మేం నేస్తున్న గుడ్డకూ కరువే... బాకీ తీర్చకపోతే మగ్గం పట్టుకెళ్ళతారేమో! పోనీండి, నా పీడ విరగడవుతుంది అప్పులెగేసిన వాళ్ళను జైళ్ళో పెడితే బాగుండునండి బాబూ! ఈ తిండి, గుడ్డా, ఇల్లూ, పిల్లా జల్లా- కొంత కాలం తప్పినా తప్పినట్టే. మాకింత ఆదరువు చూపించడం చేతకాకపోతే పోనిండి గానీ- కనీసం మాలాంటి వాళ్ళను జైల్లో పెట్టడం కూడా ఈ గవర్నమెంటుకు చాతకాకపోతే ఎల్లాగండీ!" అన్నాడు రామస్వామి.

వ్యాఖ్య అనవసరం!